# 24

హిందీ మూలం: విష్ణుప్రభాకర్
అనువాదం : డా॥వెన్నా వల్లభరావు

ప్రియ మిత్రమా!

మీకు ఈ ఉత్తరం రాయాలని నిర్ణయించుకోవటానికి నాకు సంవత్సరం పట్టిందని మీరు ఊహించగలరా? ఆ సంఘటన జరిగి వుంటే బహుశా నేను ఎప్పటికీ ఉత్తరం రాసి ఉండేదాన్ని కాదు. మిమ్మల్ని ఏమని సంబోధించాలో నాకు పాలుపోలేదు. వెంటనే తోచినవిధంగా సంబోధిస్తున్నాను. ఉత్తరం రాయటానికి మరో కారణం - మనస్సులోని బాధ కొంతైనా తగ్గించుకుందామని...నేను మనస్సు ఎవరి వద్దోగాని విప్పలేను... మీకు జ్ఞాపకం ఉండే ఉంటుందేమో! సుమారు రెండు సంవత్సరాలక్రితం మీరు మా నికేతన్‌కి వచ్చారు. నేను అప్పుడే కొత్తగా అక్కడికి వచ్చాను - బ్రతికి ఉన్నానో, చనిపోయానో నాకే తెలియని స్థితిలో. జీవించటం-మరణించటం కేవలం ఊపిరినిబట్టి కాదేమో!

# మరో కుంతి

కాని నేను ఆ తత్వవివేచనలో చిక్కుకోవాలని అనుకోవటం లేదు. మనిషి, చిక్కును విడదీసే ప్రయత్నంలో స్వయంగా తానే చిక్కులో చిక్కుకుపోతాడు. ఈ చిక్కునుంచి బయటపడదానికే నేను సంవత్సరం నుంచి పోరాడుతున్నాను. స్త్రీ-పురుష సంబంధాల్ని గురించి 'ప్రజ్ఞ' మాసపత్రికలో మీరు రాసిన వ్యాసం చదివాను. వెంటనే ఉత్తరం రాద్దామని అనుకున్నాను. ఆ వ్యాసం చదివి నేనెలా అయిపోయానో! దాని ఫలితమే ఈ ఉత్తరం. ఇక్కడికి ఎంతోమంది వస్తారు. ఎన్నెన్నో విషయాలు చెపుతారు. విరహం-సమాగమాల దృశ్యాలనెన్నింటినో చూశాను నేను ఇక్కడ. వ్యాపారం కూడా జరుగుతుందిక్కడ. కాని మీ విషయంలో అలాంటిదేమీ జరగలేదు. అయినా మీరు నాకు ఎప్పుడూ జ్ఞాపకం వస్తున్నారు, ఎందుకు? ఎందుకు మిమ్మల్ని ఆత్మీయులుగా నా మనస్సు భావించిందో!

మీకు బాగా జ్ఞాపకం ఉండి ఉంటుంది. అప్పుడు మబ్బులులేని స్వచ్ఛమైన ఆకాశం ఆరుబయటకు రమ్మని ఆహ్వానిస్తుంది. కాని, నేను ఒక మూలనా అయిదుగురు పిల్లలమధ్య, జీవచ్ఛవంలా పడున్నాను. నన్ను చూపించి నికేతన్ నిర్వాహకురాలు మీతో ఏదో చెప్పింది. నేను విన్నది కొంచెమే అయినా అర్థం చేసుకుంది మాత్రం చాలా ఎక్కువ. నాకు చేరువగా నడుచుకుంటూ నేను పడుకున్న కిటికీ వద్దకువచ్చి మీరు నిలబడినప్పుడు మీరెవరో నాకు అర్థమైంది. నన్ను చూసి మీ ముఖంలో ఏ భావమూ కలగలేదో-మీరు

కలగనీయలేదో తెలియదుగాని మీరు కిటికీ వెనుక నిలబడి మాట్లాడిన మాటలు నా చెవినపడ్డాయి. నిర్వాహకురాలు మీతో అన్నది- "చూడండి, ఎంతోమంది వస్తారు ఇక్కడికి, ఇక్కడి విషయాల గురించి ఎంతో రాస్తారు. నేను మిమ్మల్ని వేడుకుంటున్నాను. మీరు రచయిత. రచయిత ఎంతో సానుభూతిపరుడుగా ఉంటాడు. మీరు ఈ స్త్రీని గురించి మాత్రం దయచేసి ఏమీ రాయకండి..."

మీరు ఎన్నో క్షణాలపాటు ఆలోచిస్తూ ఉండిపోయారు... నాకు తెలుసు. ఆ క్షణాల్లో మీ హృదయంలో సముద్ర మథనం జరిగి ఉంటుంది. చివరికి మీరు పెద్ద నిట్టూర్పు విడిచి ఆవిడతో అన్నారు- 'అలాగే'. ఆ ఒక్క మాటలో ఎంత వేదన, ఎంత అనుభూతి, ఎంత వివశత్వం! అప్పుడు మీ ముఖంలో వ్యక్తమైన విషాదభరితమైన వివశత్వం క్రమ క్రమంగా నా శరీరమంతా వ్యాపించింది. నేను ఉన్నఫళాన లేచివచ్చి కిటికీచువ్వలు పట్టుకొని ఆత్రంగా అటువైపు చూశాను. అప్పటికే మీరు నిర్వాహకురాలితో కలిసి బయటకు వెళ్ళిపోతున్నారు. నా కన్నీళ్ళు కిటికీ చువ్వల్ని తడిపేస్తున్నాయి. గేటు దగ్గరకు వెళ్ళి మీరు వెనుదిరిగి చూశారు. నన్ను చూద్దామని కాదు, నిర్వాహకురాలికి నమస్కరించటానికి. మీరు నన్ను చూడకపోయినా నేను మాత్రం మిమ్మల్ని చూశాను. ఆ క్షణంలోనే అనుకున్నాను - మీరు నా కథ కాగితంపై పెట్టకపోయినా, మీ హృదయంలో నిరంతరం జీర్ణించుకుంటూ ఉంటారు కదా...

నిర్వాహకురాలు మీకు నాకథ చెప్పి ఉంటుంది. కాని పూర్తిగా చెప్పగలిగిఉంటుందా? అసలు ఎవరైనా నా వేదనాగాథకు శబ్దాలని సమకూర్చగలరా? నిజానికి నేను కూడా చెయ్యలేను. బాధలు భరించి, భరించి అనుభూతిని పొందే శక్తే నాలో నశించింది. మీరు నమ్ముతారో లేదో, మీరు రాసిన ఆ వ్యాసం చదివిన పిమ్మట నేను మొట్టమొదటిసారి నాకథను అర్థం చేసుకోగలిగాను. ఆ వ్యాసం మీరు నాకోసం రాయలేదని తెలుసు. సప్త సముద్రాలు దాటి ఏదో దేశం వెళ్ళినప్పుడు మీ యాత్రా స్మృతులను రాశారు. అమ్మమ్మ చెప్పిన కథల్లో సప్త సముద్రాలు దాటిన గాథలెన్నో విన్నాను- సాహసవంతుడైన రాకుమారుడు, అందమైన రాకుమారికి సంబంధించినవి. కాని మీరు రాసిన వ్యాసంలో రాజకుమారుని ప్రస్తావనా లేదు, రాజకుమార్తెదీ లేదు. కాని దానిలో అద్భుత సాహసం, వింతైన సౌందర్యపు కథ నిండి వుంది. స్త్రీ - పురుష సంబంధాల కథ...

నాకథ కూడా ఆ సంబంధాల వేదనాగాథే. నేను మంచి సంప్రదాయ కుటుంబంలో పుట్టిన అమ్మాయిని. అలాంటి మరో సంప్రదాయ కుటుంబంలో కోడలినయ్యాను. మా అత్తింటి వారిది సంపన్న కుటుంబం. నేనెంతో అందంగా, ఆకర్షణీయంగా ఉండేదానిని. ఆరోజు కూడా మీరు, విచారంతో కునికిపాట్లు పడుతున్న నా కళ్ళల్లో ఆకర్షణని గమనించే ఉంటారు. అలాంటి అందమైన కళ్ళుండటం చేతనేనేమో, నేను మాటిమాటికీ వంచనకి గురవుతూ వచ్చాను. నాకు పందొమ్మిది సంవత్సరాల వయసున్నప్పుడు నేను ఎలా ఉండి ఉంటానో మీరు ఊహించలేరు. సౌందర్యాన్ని మాటల్లో మూటకట్టటం ఒక విషయం, దానిని కళ్ళారాచూసి అనుభూతిని పొందటం మరొక విషయం. ఐశ్వర్యం, విలాసాల్లో తేలియాడుతూ నేను నాభర్తతో అపురూపమైన జీవన మాధుర్యాన్ని చవిచూస్తున్నాను. మా కాపురం బంగారు కలలాగా సాగిపోతూ ఉంది.

సరిగ్గా అదే సమయంలో మా ప్రాంతపు భాగ్యాకాశంలో కష్టాల కారుమేఘాలు కమ్ముకున్నాయి. అవి దేశానికి దురదృష్టంగా ఎలా మారాయో మీకు ప్రత్యేకంగా చెప్పవలసిన అవసరం లేదు. ఆ మహా వినాశనంలో ఎవరు ఎక్కడకు పోయారో, ఎవరి తలరాత ఎలా మారిందో ఈ విషయాల్ని చరిత్రకారులు పద్దురాసి ఎన్నటికీ చూడలేరు. చూడకూడదు కూడా. మన మచ్చని శాశ్వతపరుచుకోవటంలో గొప్పేముంది? భగవంతుని సర్వోత్తమ సృష్టి అయిన మానవుడు అదును దొరికితే క్షణంలో ఎలాంటి రాక్షసుడిగా మారిపోతాడో కాలం నిర్దాక్షిణ్యంగా ఋజువుచేసిన సంఘటన అది.

నేను మళ్ళీ తత్వవివేచనలో చిక్కుకున్నాను. లోపలదాగున్న ఆడంబరం లక్ష ప్రయత్నాలు చేసినా నిరంతరం విస్మృతమౌతూ పగుళ్ళలో నుంచి నలుదిశలకూ వ్యాపిస్తూనే ఉంటుంది. ఒకరోజు ఉన్నట్టుండి మా ఇంటిపై భయంకరమైన దురాక్రమణ జరిగింది. ఆ బీభత్స దృశ్యానికి మాటలు ఎలా కట్టను? మా ఇంటిలోని ఎక్కువమంది సభ్యులు అప్పటికే శరణార్థి శిబిరానికి చేరుకున్నారు. కేవలం నేను, నా భర్త మాత్రమే ఇంట్లో ఉన్నాం. చివరిలో వెళదామనుకొన్నాం. ఇంతలోనే ఆ దురాక్రమణ. ఆయన ఎంతో ధైర్యంతో ఎదిరించారు.. కాని.. ఆ దుర్మార్గులు ఆయన్ని పొట్టనపెట్టుకున్నారు.. తర్వాత... ఆయన శవంపై... బలాత్కరించారు... నాపట్ల...

ఒక్కొక్కప్పుడు మనిషి పిచ్చివానిలా ఊపిరిసలపకుండా మాట్లాడదూ, అలాగే నేను ఒక్క ఉదుటున ఈ విషయం రాసేశాను. ఊపిరి తీసుకుంటే రాయగలిగేదాన్ని కాదు... నాకు తెలివి వచ్చేసరికి నేను ఒక చిన్న మురికిగా ఉన్న ఇంట్లో పడున్నాను-ఒంటరిగా, నిస్సహాయంగా. శరీరావయవాలన్నీ ప్రాణహీనంగా, చేతనాశూన్యంగా ఉన్నాయి. నేను మరణించానని, నా అపవిత్రతకు ఫలితంగా శిక్ష అనుభవించటం కోసం నరకంలోకి నెట్టి వెయ్యబడ్డానని నాకు అనిపించింది. రాత్రి నందనోద్యానవన విహారం చేసినట్టు కలకన్నవానికి తెల్లవారగానే నరకంలో కళ్ళు తెరచినట్టు అనిపించింది. కాని అది నరకం కూడా కాదు. క్రమక్రమంగా వెలుగు నా చుట్టూ వ్యాపించసాగింది. నాలో చైతన్యం మేల్కొంది. నేను లేచే ప్రయత్నం చేస్తుండగానే ఒక వ్యక్తి ఎవరో తలుపు తెరుచుకొని నా ముందుకువచ్చి నిలబడ్డాడు. ఎన్నో క్షణాలపాటు అతను నన్నే చూస్తూ ఉన్నాడు కన్నార్పకుండా. నేను కూడా చూస్తూ ఉన్నాను కాని రెప్పలార్పుతూ. అతనిడిగాడు, యుగాల పిమ్మట ఎక్కడో దూరం నుంచి, 'ఒంట్లో ఎలా ఉంది?'

వెంటనే అరిచాను నేను, "నేనెక్కడున్నాను? మీరెవరు"? ఆరోగ్యవంతునిలా కనిపించిన అతని ముఖంలో కాఠిన్యంలేదు. నెమ్మదిగా ఇలా అన్నాడు- "నువ్వెవరో నాకు తెలియదు. మీ కుటుంబంలో వాళ్ళు ఎక్కడుంటారు? గూండాలు కొంతమంది స్త్రీలను ఎత్తుకెళుతుంటే సైన్యం వాళ్ళను పసిగట్టింది. వాళ్ళు తలపడుతూ ఉంటే ఎంతోమంది అమ్మాయిలు ఎటుపడితే అటు పారిపోయారు. ఎటువాళ్ళు అటు పారిపోయిన పిమ్మట ఒక పొలంలో స్పృహ తప్పి పడిపోయి ఉన్న నిన్ను చూశాను. నేనెవరినో తెలుసుకునే ప్రయత్నం వదిలెయ్. నా పేరు నూర్. మీ కుటుంబంలో వాళ్ళెవరో, ఎక్కడుంటారో చెబితే వాళ్ళను వెతికే ప్రయత్నం చేస్తాను."

అతని నిజాయితీతో కూడిన సూటిమాటల్లో ఎంత సానుభూతో! నేను ఏడ్చాను. వెక్కిళ్ళు పెడుతూ నా కథంతా చెప్పాను. కొన్ని క్షణాలపాటు అతనేమీ మాట్లాడలేదు-బహుశా చెప్పరానిదేదో చెప్పటానికి ధైర్యం కూడగట్టుకుంటున్నట్టున్నాడు. నెమ్మదిగా అన్నాడు, "ఆ పట్టణంలో మీ కుటుంబానికి చెందినవారెవరూ ఇప్పుడు లేరు. మీ కులంవాళ్ళు కూడా లేరు. కొంతమంది శరణార్థి శిబిరానికి వెళ్ళిపోయారు. హిందూస్తాన్ వెళ్ళటానికి-మరికొంతమంది హింసాద్వేషాల వరదలో కొట్టుకుపోయారు...!"

నేను విలవిలలాడిపోయాను. గట్టిగా అరిచాను. "నేను శరణార్థి శిబిరానికి వెళ్ళొచ్చా? ఇక్కడినుంచి బయటపడటానికి మీరు నాకు సాయం చెయ్యలేరా? దయచేసి..."

అతను గోడను ఆనుకుని నిలబడి ఉన్నాడు. కొంచెం దగ్గరకొచ్చి నెమ్మదిగా అన్నాడు, "ఇప్పుడు అసాధ్యం. ఎటుచూసినా విద్వేషపు లావా వ్యాపిస్తూ

ఉంది. ఏదైనా చీకటిరాత్రి నిన్ను నా ఇంటికి తీసుకువెళతాను. నీకోసం కొత్తబట్టలు తీసుకొచ్చాను. ఇవి కట్టుకో... ఇప్పుడు నువ్వు ఆయేషా వి..."

"ఏమిటీ?"

"అవును... ఇప్పుడు నీపేరు ఆయేషా.. అర్థమైందనుకుంటాను!"

ప్రియ మిత్రమా! ఆ బట్టలు కట్టుకుంటూ నేనెంత ఏడ్చానో! అయినా నూర్ కోరుకున్నట్టే జరిగింది. తరువాతి తొలి అమావాస్య రాత్రి నేను ముఖంపై మేలిముసుగు వేసుకొని అతని ఇంటికి వెళ్లిపోయాను. ఆ ముసుగు తాత్కాలికం కాదు, శాశ్వతంగా వేసుకున్నాను. చావలేకపోయాను. చనిపోవాలనుకున్నానా! కాని తనకుతానే అపరిచితంగా మారిపోవటం చావుకన్నా విషాదం. నూర్ నన్ను ఎందుకు కాపాడదలిచాడో నాకు తెలుసు-నేను స్త్రీనని, అందునా సౌందర్యవతినని... స్త్రీ-పురుషుల మధ్య ఈ సంబంధమే గదా శాశ్వతమైనది!

మరొకవిషయం ఏమిటంటే, నూర్ అవివాహితుడు-హిందువు. ఆ విషయం నాకు చాలారోజుల తర్వాతగాని తెలియలేదు. అతను తన ఆస్తిపాస్తుల్ని కాపాడుకోవటం కోసం మహమ్మదీయునిగా మారాడు.

చాలా పెద్దకథ నాది... ముక్కలు ముక్కలుగా మాత్రమే చెప్పగలను. కావాలంటే నవల రాసుకోవచ్చు. కాని నా విన్నపమేమిటంటే-దయచేసి అలాంటి ప్రయత్నం చెయ్యొద్దు. నేను తల్లిని కాబోతున్నానన్న విషయం నాకు తెలిసిన క్షణం నా మనస్సులో కలిగిన భావానుభూతిని ఎవరు మాటలలోకి మార్చగలరు? భరింపరాని బాధ, ద్వేషం వరదలా నన్ను ముంచెత్తాయి. పొట్టపై పిడిగుద్దులు గుద్దుకుని కడుపు పోగొట్టుకునే విఫలయత్నం చేశాను. కాని నూర్ అప్రమత్తంగా ఉన్నాడు. నేను చేసిన ప్రయత్నం ఫలించలేదు. నిజానికి నా ప్రయత్నాన్ని ఫలించకుండా చేసిన బలమైన భావన ఏదో నాలోనే ఉంది. మనలోనే ఉన్న 'నేను'లోని శక్తిని మనం ఎప్పుడు తెలుసుకోగలుగుతాము...?

నా భర్తతో అన్యోన్యదాంపత్యానికి తీపి గుర్తుగా నాకు కలిగిన కొడుకు ఎక్కడున్నాడో? ఎలా ఉన్నాడో! వాడిని తలుచుకొని ఏడ్వని రోజులేదు. భర్త ఎలాగో తిరిగివచ్చేది లేదు. కనీసం కొడుకుని కూడా చూసుకోలేనా... కాని నేనిప్పుడు పుట్టబోయే కొత్త బిడ్డను గురించి చెపుతున్నాను. ఎక్కడినుంచి వచ్చాడు వీడు, ఎలా వచ్చాడు? నూర్ నా దగ్గరకైనా రాలేదు! ఇది... ఇది... బలాత్కారానికి ఫలితం. భగవాన్! నువ్వంటూ ఉన్నావా? నిజంగా ఉన్నావా...?

ఆ దయాహీనుడైన దైవాన్ని ఎంతగా పిలిచాను! ఎంత వేడుకున్నాను! అతని హృదయం కరగలేదు. కాలం మాత్రం కరిగిపోసాగింది.. నా గర్భం మాత్రం నిలిచింది అని నాకు అనిపించింది. నా చుట్టూ రగిలిపోతున్న అగ్నిగుండం... అందులోనుంచి మనిషి రక్తమాంసాల కమురు వాసననో ముక్కు రంధ్రాలగుండా చొచ్చుకుపోతుంది. నేను నిద్రలో గావుకేకపెట్టే దానిని. బయటకు పారిపోవాలనుకునే దానిని...

కాని ఈ భయానక దృశ్యాల మధ్య నూర్ చలించని రాతిబండలా నిలిచి ఉన్నాడు. అతను నాకు చేరువగానూ వచ్చేవాడు కాదు, దూరంగానూ వెళ్ళేవాడు కాదు. నా కన్నీళ్ళు తుడవడానికి శక్తివంచన లేకుండా కృషి చేశాడు. నా కుటుంబం ఆచూకీ తెలుసుకోవటానికి ఎంతైనా ప్రయత్నం చేశాడు, కాని సఫలీకృతుడు కాలేదు. అప్పుడొకరోజు నా దగ్గర కూర్చొని అన్నాడు- "నెమ్మదినెమ్మదిగా గొడవలు సద్దుమణుగుతున్నాయి. మిమ్మల్ని పంపించటానికి సైన్యం వస్తుంది. నువ్వు కోరుకుంటే భారత్‌కి వెళ్ళిపోవచ్చు."

ఆశ్చర్యం! నేను ఆ క్షణాన తామరాకులాగా కంపించిపోయాను. గట్టిగా అరిచి చెప్పాను- "వద్దు.. వద్దు.. నేనెక్కడికీ వెళ్ళలేను.. వెళ్ళను."

అప్పుడు నూర్ తొలిసారి నా చెయ్యి తనచేతిలోకి తీసుకుని ప్రేమగా తట్టాడు. ఆ స్పర్శతో నా నరనరాన అనిర్వచనీయమైన సానుభూతి ప్రవహించింది. అది నాకెంతో ఓదార్పునిచ్చింది. ఆరోజు అతను మౌనంగా వెళ్ళిపోయాడు. మరల మూడవరోజు, ఐదవరోజు, ఏడవరోజు మళ్ళీ అదే మాట అన్నాడు. నేను నిరంతరం నాతో నేను పోరాడుతూనే ఉన్నాను. చివరికి పదిహేనవరోజు వచ్చి చాలా ప్రేమగా "పద, వాళ్ళు చాలా దగ్గర ఉన్నారు. నేను నిన్ను పంపించి వస్తాను. నీకు రావటం ఇష్టంలేకపోతే వాళ్ళనే ఇక్కడకు పిలుచుకువస్తాను" అన్నాడు.

నేను చాలా శాంతంగా ఉన్నాను. దృఢమైన స్వరంతో సమాధానం ఇచ్చాను. "నేను వెళ్ళను. మీకు జరిగిందంతా చెప్పాను... అన్నీ తెలిసి కూడా వెళ్ళమంటున్నారు... ఎందుకు?"

అప్పటికి నూర్ తన కథ నాకు చెప్పాడు.

చాలాసేపు నావంక అలాగే చూస్తూ ఉండిపోయాడు. ఆ తర్వాత మళ్ళీ ఎప్పుడూ నన్ను వెళ్ళిపొమ్మని అనలేదు. ఇక నేను జీవితాంతం ఇక్కడే ఉండాలి.

ప్రియ మిత్రమా! ఘోరమైన దుఃఖంలో మునిగి ఉన్నా ఆ రోజు నా ముఖంలో మొట్టమొదటిసారి చిరునవ్వు పొంగి వచ్చింది. దానితోనే మొదలయ్యింది నా జీవితంలో రెండవ అధ్యాయం! ఒకానొకరోజున నేను తల్లినయ్యాను. బలాత్కారం కారణంగా ఊడిపడిన ఆ కొత్త శిశువును చూస్తేనే ద్వేష భావం నాలో పొటమరించేది. కాని ఆ అమాయకుని కళ్ళల్లో ఏముందో తెలియదుగాని నా హృదయంలో ఏదో విచిత్రమైన బాధ, సానుభూతికలిగి నన్ను పిచ్చిదాన్ని చేసేవి. స్త్రీ యొక్క కారాగార వాసపు కథ ఇక్కడే ప్రారంభమౌతుంది.

ప్రియమిత్రమా! మీరు నమ్ముతారో లేదో, ఆరునెలలు గడిచాయో లేదో నేను మళ్ళీ నెలతప్పాను. నేను ఇప్పుడు నూర్ భార్యను. అతను నా కుమారుణ్ణి అక్కున చేర్చుకున్నాడు. నేను నా గత జీవితాన్ని హృదయం నుంచి కడిగి తుడిచేసుకున్నాను. కడిగి తుడిచేసుకోవటం అనే ప్రక్రియ ఎంత బాధాకరమైనది! అది ఇప్పుడెలా చర్చించను? భర్త చనిపోయాడు. వాళ్ళ కుటుంబం నన్ను స్వీకరించదు. అయితే కుమారుని జ్ఞాపకాలు నన్ను ఆవహించే ఉన్నాయి. ఎంతటి విషాదమో చూడండి- దాంపత్య ప్రేమకు ప్రతిబింబమైన కొడుకు దూరమయ్యాడు, ఈ...

ఇప్పుడది కథకాదు. నేను చెప్పినంత మాత్రం చేత కథ సమాప్తం కాదు. నూర్ తన ఆస్తిపాస్తులు కాపాడుకోవటానికి మహమ్మదీయునిగా మారాడని ఇక్కడి వారికి తెలుసు. నెమ్మది నెమ్మదిగా వాళ్ళు అతనిపై ఒత్తిడి చెయ్యసాగారు. అతను వాళ్లని ఎదిరించటానికి ప్రయత్నం చెయ్యటంతో వాళ్ళతనిని చంపేశారు. గాయం మీద గాయమైన తనువు-మనస్సుతో నేను మళ్ళీ సందిగ్ధస్థితిలో పడ్డాను. పాషాణంగా మారిన స్త్రీ కూడా భూమి వంటిదే కదా! భూమికి నోరుండదు.. అన్నపూర్ణ అయిఉండి కూడా అది ఎవరో పురుషుడికి చెందిన సంపదే...

ఏడవరోజు మరొక నూర్ అడుగుల చప్పుడు నాకు దగ్గరగా వచ్చి ఆగింది. నేను కళ్ళు తెరిచాను. అతను నా సమీపంలో కూర్చుని "నా పేరు ఫారూఖీ. ఇక్కడ కాలేజీలో చదువు చెపుతుంటాను. నూర్ నిష్కారణంగా చంపబడ్డాడు. నాకు స్నేహితుడు. అతని మరణం నన్నెంతో దుఃఖానికి గురిచేసింది. అతను ఈ ఇల్లు నాకు ఇస్తానని మాట ఇచ్చాడు.. భయపడొద్దు, నేను నిన్ను వెళ్ళమని చెప్పను. నువ్వు ఇక్కడే ఉండొచ్చు" అన్నాడు.

నేను ఏం చెయ్యాలో పాలుపోక కళ్ళింతవి చేసి ఇంటికప్పు వైపు చూడసాగాను. నేను సౌందర్యవతినని, అందునా వయసులో ఉన్నానని నాకు

తెలుసు. ఈ రెండు - రెండున్నర ఏళ్ళలో చవిచూడని కష్టంలేదు. అయినా యౌవనపు పొంగు నా శరీరంలో తిష్టవేసి కూర్చునిపోయింది. చావు మాటిమాటికి నాకు చేరువగా వచ్చి తిరిగి వెళ్ళిపోతుంది. ఈసారికూడా అలాగే తిరిగివెళ్ళిపోయింది. నేను జీవచ్ఛవంలా బ్రతుకు ఈడ్చుసాగాను.

మిత్రమా! స్త్రీ - పురుష సమానత్వం కోసం పరస్పర ఆకర్షణ నుంచి బయటపడాలని రాశారు మీరు. నమ్ముతారో లేదోగాని ప్రొఫెసర్ ఫారూఖీకి నాపట్ల ఉన్న ఆకర్షణే నాకు మరొకసారి జీవితాన్నిచ్చింది. మరొకసారి నా దేహంలో వసంత వాయువు వీచింది. ప్రతి స్త్రీ హృదయంలో తప్పకుండా ఒక పురుషుడు ఉంటాడు. ఫారూఖీ నిజంగా మగాడు. కవి కూడా. అతని కవితలు అనేకం ఇప్పటికీ నా హృదయాన్ని కల్లోల పరుస్తూనే ఉంటాయి. అతను నాపట్ల ఎంతో సౌజన్యం కనపరిచాడు. నా ఇద్దరి పిల్లలకి ఎలాంటి లోటు రానివ్వలేదు. ప్రేమ, మానవత్వపు పరిమళాన్ని అందుకొని వాళ్ళు ఎదుగుతున్నట్టే నా మనసూ చిగురించింది. హృదయ బాంధవ్యం శరీర సంబంధంగా పరిణమించింది. అతను నన్ను విధిపూర్వకంగా నిఖా చేసుకున్నాడు. నా పేరుని సురైయాగా మార్చాడు. నా జీవితంలో ఇతను నాల్గవ పురుషుడు.

పాశ్చాత్యదేశాల్లోని స్త్రీ 'ఇతను నా నాల్గవ భర్త' అని చాలా మామూలుగా చెప్పగలుగుతుందని రాశారు మీరు. ప్రాచీన భారతంలో కూడా కుంతి 'ఇంద్రుడు నాజీవితంలో నాల్గవ పురుషుడు' అని చెప్పి వుండవచ్చు. ద్రౌపది ఒకే సమయంలో అయిదుగురు భర్తలకు ప్రాణ ప్రియురాలిగా ఉన్నది. వారంతా మనకి ప్రాతః స్మరణీయులు-పూజ్యులు. కాని నేను 'ఫారూఖీ నా జీవితంలో నాల్గవ పురుషుడు, నేను నాల్గవసారి తల్లిని కాబోతున్నాన'ని ఎప్పుడైనా చెప్పగలనా?

కాల ప్రవాహంలో స్త్రీ-పురుష సంబంధాలు ఎక్కడినుండి ఎక్కడకు కొట్టుకుపోయాయో!

మళ్ళీ నేను తర్కజాలంలో చిక్కుకుంటున్నాను. సరే, ఒక్క విషయం మాత్రం నేను గట్టిగా చెప్పగలను-నేను గనుక నా మొదటి భర్తతో ఉండి ఉంటే, నాల్గవసారి తల్లినవుతున్నందుకు ఆనందోత్సాహాలు వెల్లివిరిసేవి. ఆశీర్వాదాల వర్షం కురిసేది నాపైన. మాతృత్వపు గౌరవంతో నా నుదురు కుంకుమతో ప్రకాశించేది. తల్లిని ఇప్పుడూ అవుతున్నాను. కాని, గౌరవమందటానికి తగినవిధంగా మాత్రం కాదు. అంతా వివశత్వపు నిరాసక్తత. నన్ను బలాత్కరించిన పఠాన్ పేరైనా నాకు తెలియదు. అతను తప్ప నూర్, ఫారూఖ్ మాత్రం నాకు ప్రేమని అందించారు. అప్పుడప్పుడు అలుముకునే తీవ్రమైన విషాదం ఉన్నప్పటికీ నేను ఆ ప్రేమ కారణంగానే జీవించాను. మనస్సులోని భావాలను దాచుకోవలసిన అవసరం ఇప్పుడేముంది? మనిషి కేవలం తన ఆంతరిక శక్తి సాయంతోనే జీవించడు, అతనికి సాటివారి సానుభూతి వల్ల కలిగే శక్తికూడా అవసరమవుతుంది.

అయితే, ఈ ఆనందం కూడా శాశ్వతం కాలేదు. ఒకరోజు అకస్మాత్తుగా ఫారూఖీ కంగారుపడుతూ వచ్చాడు. "సురైయా! శత్రువులు సఫలీకృతులయ్యారు. నన్ను ఇక్కడి నుంచి దూరంగా, వేరే కాలేజీకి బదిలీ చేయించారు. నేను ఈరోజే బయలుదేరాలి" అన్నాడు.

ఆ వార్త విన్న నాకు ఉన్నఫళాన మరుగుతున్న కళాయిలో పడ్డట్టనిపించింది. గట్టిగా అరిచాను. "వద్దు... వద్దు... నేను ఒంటరిగా ఉండలేను. నేను కూడా నీతోపాటే వస్తాను." అన్నానుగాని నేనెలా వెళ్ళగలను? అప్పుడే పచ్చి బాలింతను. నాల్గవసారి తల్లినయ్యాను- ప్రొఫెసర్ ఫారూఖీ కుమారునికి. ఆ రాత్రంతా మేమిద్దరం నిద్రపోలేదు. చంటి పిల్లాడినే చూస్తూ

# పునరుత్థానం

కొండెపోగు బి.డేవిడ్ లివింగ్‌స్టన్

లోకంతీరు అంతే
సత్యాన్ని అది సిలువేస్తూనే వుంటుంది
బందిపోటు బరబ్బా మాత్రం
జబ్బులు చరుచుకుంటూ
జైలుగోడల నుండి
విడుదలౌతూనే వుంటాడు
పరీక్షా సమయానికి
శిష్యులు పలాయనం చిత్తగిస్తూనే వుంటారు
తమనూ సిలువేస్తారేమోనని వాళ్ళ భయం
నిర్లజ్జగా జనంలో చేరిపోయి
పాలలో విషపు చుక్కలా
యూదా ఎప్పటికీ కనిపించడు.
దొంగలెపుడూ
నీతిసూక్తులు వల్లిస్తూనే వుంటారు.
అవినీతిపరులు
తమ త్యాగశీలత గురించి
తెగ లెక్చర్లిస్తూనే వుంటారు.
ఒకరిద్దరు మాత్రం
కోడి కూతకు జడుసుకుని
లోలోపల వ్యర్థంగా
పశ్చాత్తాప పడుతుంటారు.
నియంత అమాయకత్వం నటిస్తూ
ప్రజాస్వామ్యాన్ని నమ్మబలుకుతుంటాడు.
పిలాతు ఎందుకొచ్చిన గోలంటూ
చేతులు కడుక్కుని వెళ్ళిపోతాడు.
న్యాయాన్ని, ధర్మాన్ని
డబ్బుతో కొనెయ్యగలనని
సైతాన్‌కు గొప్ప ధీమా.
కాలమంతా భజనపరులది
అబద్ధ సాక్షులదైనపుడు
చాడీలు చెప్పేవాళ్ళు
ఆప్తమిత్రులు కావడంలో వింతేముంది?
ఎక్కడ చూడు
ఇపుడు నక్కలదే రాజ్యం
రాబందుల రాజకీయంలో
సత్యం సిలువెక్కవచ్చు
న్యాయం అటకెక్కవచ్చు
కానీ-
పూడ్చిపెట్టిన విత్తనం
ఒకరోజు నేలను బద్దలు చేస్తూ
ఖడ్గంలా తలెత్తుతుంది
నిప్పు పూలతో గొంతు విప్పుతుంది
తెలుసా? పునరుత్థానాన్ని
ఎవడూ నిలువరించలేదు
రెండు చేతుల్తో
నిండు సూర్యుడిని
ఎవ్వడూ మూయలేడు

గడిపాము... ఫారూఖీ నన్ను ఓదారుస్తూ ఉన్నాడు. తెలతెల వారుతుందనగా అతను వెళ్లిపోయాడు. వెళ్ళేటప్పుడు నిజం చెప్పాడు. "నేను తప్పకవస్తాను. ఇదంతా మోసమని నాకు తెలుసు. నానుంచి ఈ ఇంటిని వాళ్ళు హస్తగతం చేసుకున్నారు. నేను నూర్‌ని చంపి అతని భార్యని అక్రమంగా ఉంచుకున్నానని నాపై నేరం మోపారు. నువ్వేమో హిందూస్తాన్ నుంచి తరిమివెయ్యబడ్డ హిందూస్త్రీవి. నేను పరదేశిని. అధికారులంతా వాళ్ళపక్షానే ఉన్నారు. అయినా నేను తిరిగి వస్తాను. నేను నీ కోసం అన్ని ఏర్పాట్లు చేశాను. ఆయా వచ్చి వెళుతూ ఉంటుంది అప్పటివరకు."

అతను నన్ను ముద్దు పెట్టుకున్నాడు. చాలాసేపటివరకు నా వ్రేళ్ళను పట్టుకుని నా కళ్ళల్లోకి చూస్తూ గడిపాడు. ఆ చూపుల్లోని ప్రేమ, బాధ, క్షమ నా దుఃఖ ప్రవాహపు ఆనకట్టను తెంచేసాయి. అతను వెళ్ళగానే వెక్కి వెక్కి ఏడ్చాను..

మూడవరోజు నేను కొంచెం ప్రశాంతంగా ఉన్నప్పుడు ముజఫర్ నా ముందుకు వచ్చాడు. అతని కళ్ళల్లో కొంటెతనం, అతని పెదాలపై సన్నని చిరునవ్వు. అతను, నా అనుమతి తీసుకుని లోపలికి వచ్చాడు. నెమ్మదిగా అన్నాడు- "నాకు చాలా బాధగా ఉంది. ప్రొఫెసర్ సాహబ్ నిన్ను విడిచిపెట్టి వెళ్ళిపోయారు. ఆయన తిరిగివస్తారన్న ఆశలేదు. నువ్వు హిందూస్తాన్ వెళ్ళాలనుకుంటున్నావా?"

నేను మళ్ళీ ఒకసారి జీవచ్ఛవంగా మారాను. కాని నేను అబద్ధం ఆడలేకపోయాను. కండలు తిరిగిన ఆ పంజాబీ యువకుణ్ణి చూస్తూ ఉండిపోయాను. "నేను ఎక్కడికీ వెళ్ళాలనుకోవటం లేదు- చచ్చిపోదామనుకుంటున్నాను" అని మాత్రం అన్నాను.

అతను చిరునవ్వు నవ్వాడు. "నేను నిన్ను రెండురోజుల తర్వాత మా ఊరు తీసుకువెళతాను. నువ్వు అక్కడి వాళ్ళతో నీ గురించి హిందూస్తాన్‌లో కష్టాలకు గురిచెయ్యబడిన పరువుగల మహమ్మదీయ మహిళవని చెప్పాలి" అన్నాడు.

ఆ మాటలు ఎక్కడో దూరం నుంచి వచ్చి నా మెదడులో వానపాములు పాకుతున్నట్టు అనిపించాయి. వానపాములు గొప్ప ఎరువునిస్తాయని విన్నాను. నేను... బహుశా అప్పుడు ఎరువుగా ఉండిపోయాను.. కంపుకొట్టని గొప్ప ఎరువు... నేను కూడా కంపుకొడితే ఎంత బాగుండును!

మిత్రమా! ఒకానొకరోజున నేను నిజంగానే ఒక చిన్న అందమైన గ్రామంలోకి అడుగుపెట్టాను. అక్కడ ఆడ-మగ కలిసి వ్యవసాయం చేస్తారు. ఆనందంగా పాడుకుంటారు. ఎంత ఆనందమో ఆ లోకంలో! అక్కడ అందమైన ఎండ కూడా మనతో పెనవేసుకుపోతుంది. చిన్నతనంలో అమ్మానాన్నలతో కలిసి అలాంటి గ్రామంలో ఉంటూ ఎన్ని పంచవన్నెల కలలు కన్నానో! వసంతకాలపు ఆహ్లాదం నా భావాలను ఎంతగానో ఆకర్షించింది. ఇకమీదట ఎవరినీ నా దగ్గరకు రానివ్వకూడదు అని నిర్ణయించుకున్నాను. కాని, దగ్గరకు రావటం, రానివ్వకపోవటం నా చేతిలో ఉంటేగా! అది ఒక వాసన. స్త్రీ-పురుష సంబంధాల వాసన. ఎవరో ఒకరి అవయవాల నుంచి వెలువడి మరొకరి అవయవాలని ఆకర్షిస్తుంది.

ఫారూఖీ ఈ సహజ సిద్ధమైన ఆకర్షణకి ఎన్నెన్ని పేర్లు పెట్టేవాడో! కాని ముజఫర్ మాత్రం భాషాజ్ఞానంతో ఏమాత్రం పరిచయం లేనివాడు. అతని కళ్ళల్లోని కవ్వింపు, అతని పెదాలపైని చిరునవ్వు, అతని బాహువుల్లోని బిగువు ఎంత మాంసలమైనవి అంటే శవానికి కూడా బ్రతకాలనే కోరిక పుట్టిస్తాయి...

దాని ఫలితం ఏం జరగగలదో అదే జరిగింది. స్త్రీ మరల తల్లి అయింది. కాని ఈసారి కవల పిల్లలకి తల్లి. ప్రాప్తకర్మల ప్రహసనం ఎంత క్రూరంగా ఉంటుందో! నాకిప్పుడు అయిదుగురు కొడుకులు. కుంతికి కూడా అయిదుగురు కొడుకులని ప్రతీతి. ఆరవ కుమారుణ్ణి, ఆమెకు తొలి సంతానమైన బిడ్డని ఆమె త్యజించింది. నా ఆరవ కుమారుడు, నా ప్రేమకు ప్రతిరూపం... వాడు నానుంచి దూరమయ్యాడు.

మీకు వాళ్ళ పేర్లు చెప్పనేలేదు. అవసరం కూడా లేదుగాని పేరు చెప్పకుండా కథ ముందుకు సాగదు. అన్వర్, అష్రఫ్, అస్‌గర్, అహమద్, అలీ-వాళ్ళ పేర్లు.

'ఆరవ కుమారుని పేరు ఎందుకు చెప్పలేదు' అని మీరు అడగొచ్చు. వాడు నాకు కాకుండాపోయిన తర్వాత పేరుచెప్పి మాత్రం ఏమిటి ప్రయోజనం? అయినా చెపుతాను, అతని పేరు-ఆశిమ్.

మిత్రమా! నా జీవిత చక్రం వేగంగా సాగిపోతుంది. ఆ గ్రామస్థుల దృష్టిలో నేను అయిదుగురు కొడుకులకు తల్లిని, అదృష్టవంతురాలిని, సుఖంగా ఉన్నదానిని. నా దిక్కుమాలిన అందం ముజఫర్‌ని పిచ్చివాణ్ణి చేసింది. కాని సుఖసౌఖ్యాలతో ఉన్నదనుకుంటున్న ఈ దేహం జీవచ్ఛవమని, సభ్యత-సంస్కారాల ఆవరణ నుంచి వెలికివచ్చిన తోలుబొమ్మ అని, ఏదో ప్రాప్తకర్మ ఆడిస్తుంటే ఆడుతున్న బొమ్మ అని అక్కడ ఎవరికీ తెలియదు.

దీని వెనుక స్త్రీ-పురుష సంబంధాలున్నాయో లేక ప్రమాదకరమైన పరిస్థితులే ఉన్నాయో తెలియదుగాని, నేను వాటిలో చిక్కుకుంటూనే ఉన్నాను. నాపై అధికారం చెలాయించే ప్రతి పురుషునితో నేను ప్రేమ నటిస్తూ వచ్చాను. కాని నాటకానికి కూడా ఒక హద్దుంటుంది. చివరికి ఈ సారవంతమైన భూమి మీదే నా జీవితం కడదాకా గడపాలని నిర్ణయించుకున్నాను. నేను ముజఫర్ భార్యని, అతనితోనే ఉండిపోవాలి. పాండురాజులాగా అతను నా అయిదుగురు కొడుకులకు తండ్రిగా చెప్పుకోబడతాడు. నేను ముసలిదాన్నై ఏదోరోజు నా కర్షక కుమారుల చేతులమీదగా ఈ నేలలోనే ఖననం చెయ్యబడతాను. మంత్రపఠనాలు లేకపోవచ్చు. ఖురాన్ వాక్యాలు నా శరీరాన్ని ఈ మట్టికి అప్పగిస్తాయి.

కాని కురుక్షేత్ర యుద్ధం ఇంకా పరిసమాప్తం కాలేదు. ఆరోజు ముజఫర్ చాలా కంగారుగా ఇంటికి వచ్చాడు. నాతో "నువ్వు ఇక్కడ ఉండటం మంచిది కాదు. దూరంగా కనిపించే కొండల ఆవల ప్రదేశానికి వెళ్ళాలి. మీ దేశస్థులు నీవంటి స్త్రీలను గాలిస్తూ తిరుగుతున్నారు. ఈ ఊళ్ళో ఒక అమ్మాయి ఉందని వాళ్ళకి అనుమానం కలిగింది" అన్నాడు.

ఎన్నిసార్లు జరిగింది ఇలా! నేను స్తబ్ధంగా ఉండలేకపోయాను. మొద్దుబారిన కళ్ళతో అతన్ని చూస్తూ ఉండిపోయాను. అతను నన్ను తన గుండెలకు హత్తుకున్నాడు. 'నువ్వు కంగారు పడొద్దు. నీకోసం అన్ని ఏర్పాట్లు చేశాను. నా స్నేహితుడున్నాడు అక్కడ' అన్నాడు.

"నువ్వు రావా?"

"ఇప్పుడు కుదరదు... కాని, వస్తాను-త్వరలోనే వస్తాను." ప్రతిసారి నా తలరాత నన్ను మోసగిస్తూనే ఉంది. నన్ను నేనే హత్య చేసుకున్నాను అని ప్రతిసారీ నాకు అనిపించింది. ప్రతిసారి నన్ను నేనే ప్రశ్నించుకున్నాను- 'అసలు నువ్వు నువ్వేనా...?'

ఆరోజు రాత్రి కటికచీకట్లో ఊళ్ళో ఎవరితోనూ చెప్పకుండా నా అయిదుగురు పిల్లల్నీ వెంటపెట్టుకుని ఒక అజ్ఞాత ప్రదేశానికి ప్రయాణమయ్యాను. అహమద్, అలీల వయసు అప్పటికి ఒక సంవత్సరం. అస్‌గర్, అష్రఫ్, అన్వర్‌ల వయసు వరసగా 2,3,4 సంవత్సరాలు. ఎన్నోరోజులు ప్రయాణించి మేము పర్వత ప్రాంత గ్రామానికొక దానికి చేరుకొన్నాము. మీరు నమ్మరేమో! మూడు సంవత్సరాలపాటు మేము ఇక్కడనుంచి అక్కడకు, అక్కడనుంచి ఇక్కడకు

తిరుగుతూనే ఉన్నాము. మూడు-నాలుగు నెలలకి మించి ఏ ఒక్క ప్రదేశంలోనూ ఉండలేకపోయాం. సంవత్సరంపాటు ముజఫర్ వచ్చిపోతుండేవాడు. ఆ తర్వాత మా అతీగతీ పట్టించుకోలేదు. నిస్సహాయురాలనై బిచ్చమెత్తుకోవలసిన పరిస్థితి దాపురించింది.

' నా రూపం ఇంకెవరినీ ఆకర్షింపజెయ్యలేదా' అని మీరు అడగొచ్చు. ఆకర్షించింది, కాని ఇప్పుడు నాలో ఏదో తెలియని గుడ్డి చైతన్యం మేల్కొంది. తెలియకుండా వచ్చిపడే ఏదో సంఘటన జరిగేలోపే నేను ఆ ప్రదేశాన్ని విడిచిపెట్టి దూరంగా వెళ్ళిపోయేదాన్ని. నన్ను నేను కాపాడుకోవటం కోసం నన్ను, నా పిల్లల్ని మాటిమాటికి ప్రమాదంలోకి నెట్టుకుంటూ వెళ్ళాను...

ఆ సుదీర్ఘమైన విషాదగాథ విని మీరేం చేస్తారు! ముజిఫర్ వాళ్ళ ఊరు విడిచి వచ్చిన మూడు సంవత్సరాలకి నేను పెషావర్ చేరుకున్నాను. అప్పటికి నాలో మునుపటి అందమూ లేదు, యౌవనమూ లేదు. కాని ముందుకు సాగాలనే కోరిక మాత్రం మిగిలి ఉంది. ప్రమాదాన్ని ఆకర్షణీయంగా మార్చే జీవితేచ్ఛ కష్టాల్ని ఎదిరించి పోరాడేశక్తిని నాలో నిరంతరం పెంచుతూ వచ్చింది. జీవించటం కూడా ఎంత విలక్షణం!

ఏది జరగకూడదని నేను ఇంతకాలం పరుగులు తీస్తూ, పారిపోతూ వచ్చానో, చివరికి అదే జరిగింది. అన్వర్‌కి ఏడు సంవత్సరాల వయసొచ్చింది. కష్టాలు, కడగండ్ల సముద్రం వాడిలో అనూహ్యమైన సానుభూతిని పెంచింది. బిచ్చమెత్తి తెచ్చి నాకూ, తమ్ముళ్ళకు పెట్టేవాడు. చిన్నాచితకా పనులు కూడా చేసేవాడు. వాడిలో ఎక్కడినుంచి వచ్చిందో ఈ ప్రేమ, ఈ సంస్కారం! నేను కోరుకోని బిడ్డ. అత్యాచారి కొడుకు. కాని వాడే నా కాళ్ళకు దిగిన ముళ్ళు తీస్తున్నాడు. కష్టాల్లో నాకు అండగా ఉంటున్నాడు. తరువాతి బస ఎక్కడో నాకే తెలియని నా జీవితయాత్రలో వాడే తోడు-నీడ.

ఏ భయంతో అయితే ముజఫర్ నన్ను ఈ కొండల్లో దాచాడో, ఆ భయం వెంటాడుతూ వెంటాడుతూ నన్ను చేరనే చేరింది. హిందూస్తాన్ వాళ్ళు ఈ ప్రదేశంలో ప్రత్యేకించి జాగరూకులై ఉన్నారు. ప్రారబ్ధం ఎలా ఎలా ఆడిస్తుందో! అదే అన్వర్‌ని ఒకరోజు వాళ్ళవద్దకు చేర్చింది. నేను ఒకప్పుడు హిందువునని వాడికి తెలియదు. వాడి మాటల్ని బట్టి మేము ఎన్నో సంవత్సరాల నుంచి ఒకచోట నుంచి మరొక చోటుకి తిరుగుతున్నామని వాళ్ళకి తెలిసిపోయింది. వీళ్ళకు అనుమానం కలిగింది. ఆ అనుమానం వాళ్ళను నా దగ్గరకు వచ్చేటట్టు చేసింది. వాళ్ళ దగ్గర నా ఫొటో, నా పూర్తి వివరాలు ఉండడం చూసి నాకు ఆశ్చర్యమేసింది. నా కళ్లు ఇక్కడ కూడా నాకు ద్రోహమే చేశాయి. 'సురైయా' వేషంలో ఉన్న 'ప్రతిమ'ను వాళ్ళు గుర్తుపట్టారు. నా చేతి వ్రేళ్ళ సందుల్లోనుంచి మరొక జీవితం ఇసుకలా జారిపోయింది. మళ్ళీ ఒకసారి నేను చద్దామనుకున్నాను. నా పిల్లలందరితో సహా కట్టకట్టుకొని నదిలో దూకేద్దామనిపించింది. కాని జరిగిందేమంటే, నాలో కోపం పొంగి పొర్లింది. అన్వర్‌ని చేతులు నొప్పి పుట్టేదాకా కొట్టాను. వాడు విలవిలలాడాడు. వెక్కివెక్కి ఏడుస్తూ- 'అమ్మా! నేను వాళ్ళకేమీ చెప్పలేదు. ఏమీ చెప్పలేదు... నిజమమ్మా.. నన్ను నమ్మూ...!' అన్నాడు.

అభం-శుభం తెలియని ఆ పిల్లాడిని గుండెలకత్తుకొని ఆ రాత్రి నేను ఎంత ఏడ్చానో!

మిత్రమా! ప్రతిమ నుంచి సురైయా వరకు నా ఈ ప్రయాణం స్త్రీని అయినందువల్ల చెయ్యాల్సి వచ్చిన విషాదయాత్ర. స్త్రీ-పురుష సంబంధాలలో స్త్రీ విషయంలో ఎప్పుడూ విషాదమే!

కథ చివరి పర్వానికి చేరుకుంది. ఒకానొక రోజు నేను ఈ 'నారీనికేతన్'కి చేర్చబడ్డాను- సగం చచ్చిన స్థితిలో? చిరిగి పీలికలైన పాతవస్త్రం చుట్టిన శవంగా... ఎంత దీర్ఘ జీవితం గడిపాను! బహుశా ఇది అంతం... అనంతమైన అంతం. నేను మళ్ళీ ప్రతిమనయ్యాను. ఒక్కొక్క అవయవం విరగగొట్టబడిన రాతి ప్రతిమను. దాని ఆత్మకి వేయి రంధ్రాలు. ఈ దేశపు భాషలో పాపాత్మురాలు, దురాచారిణి, కళంకిణి. ఈ ఆశ్రమం నాకిచ్చిన కొత్తపేర్లు ఇవే! అందుకు సాక్ష్యం ఈ అమాయకులైన నా పిల్లలే. ఇప్పుడు వీళ్ళు అన్వర్, అష్రఫ్, అస్గర్, అహమద్, అలీ కాదు. అనీల్, అశోక్, అసిత్, అమిత్, అజిత్‌లు. బహుశా అందుకే వీళ్ళు ఇప్పుడు మునుపటికంటే అవమానాలకి, దూషణలకి, ద్వేషానికి గురయ్యారు.

నికేతన్ నిర్వాహకురాలు ఒకరోజు నాతో "మీ అత్తింటివారికి నీ గురించి వర్తమానం పంపాం. కాని వాళ్ళెవరూ వచ్చేటట్టు కనపడటం లేదు. ఎందుకంటే నీ తల్లిదండ్రులు కోరిన మీదట నిన్ను వెదికి కనుక్కున్నాం. వాళ్ళు చెప్పబట్టి కాదు" అన్నది.

"ఎవరొస్తారో, ఎవరు రారో-దాన్ని గురించిన బెంగ నాకు లేదు. కాని నన్ను ఇక్కడికి ఎందుకు తీసుకొచ్చారు అని అడిగే హక్కు నాకుందా లేదా? మమ్మల్ని అవమానించాల్సిన అవసరం మీకు ఏమొచ్చింది?"

నా ప్రశ్నలకి నిర్వాహకురాలు చిరునవ్వు నవ్వి "ఇది దేశ ప్రతిష్ఠకు సంబంధించిన ప్రశ్న" అన్నది.

మిత్రమా! మీరు సృజనశీలి. నేను మిమ్మల్ని అడుగుతున్నాను. మనిషిని అవమానించి ఏ దేశమైనా తన పరువు కాపాడుకుంటుందా? అక్కడ నేను ఎలా ఉంటున్నా ద్వేషానికి మాత్రం గురి కాలేదు. అవమానింపబడలేదు. తల్లిని భగవంతునితో సమానంగా భావించే వాళ్ళున్న దేశంలో స్త్రీ అవమానానికి గురికావటం ఏమి ఋజువు చేస్తుంది!

నిర్వాహకురాలు సరిగానే ఊహించింది. మా అత్తగారి తరఫువాళ్ళు ఒక్కరు కూడా నాకోసం రాలేదు. వచ్చిందల్లా మా నాన్న, ఆయన కూడా నన్ను కలుసుకునే ధైర్యం చెయ్యలేదు. అప్పటికే నా కథంతా ఆయన విన్నారు. తన పాపిష్టి కూతుర్ని కలుసుకుని ఆమె కళ్ళల్లోకి ఎలా చూస్తారు! ఆయన దూరంనుంచే నన్ను చూసి, ఏడ్చుకుంటూ తిరిగివెళ్ళిపోయారని నిర్వాహకురాలు చెప్పింది. ఆ తర్వాత ఆయన నాకు వెయ్యి రూపాయలు పంపారు. దూరంగా ఏ ఊరైనా వెళ్ళి నా కాళ్ళపై నేను నిలబడాలని, అవసరమైతే ఇంకా పంపుతూ ఉంటానని కబురు పంపారు. మా అమ్మకు నా గురించి తెలియటం ఆయనకు ఇష్టం లేదు.

నాన్న మనసు తెలిసి నేను నవ్వుకున్నాను. ఇప్పుడు నాకు ఏడ్పు రమ్మన్నా రావటంలేదు. ఈ స్థితినే కాబోలు విజ్ఞులు 'యోగం' అంటారు. సిద్ధావస్థ అంటే ఇది కాదా!.. మనిషి తనంతటతాను ఏమీ చెయ్యడని, ప్రకృతే అతనితో తన పనిచేయిస్తుందని శాస్త్రాలు చెపుతున్నాయంటారు. అంటే అన్నింటినీ నిర్ణయించే ఏదో శక్తి చేతిలో మనం యంత్రాలం. అలాంటప్పుడు వాళ్ళు నన్నెందుకు ద్వేషిస్తున్నట్టు..?

సరే, ఈ ప్రశ్నలన్నీ పక్కన పెట్టి నా కథ చరమ అంకం చెపుతాను. నికేతన్‌లో ప్రతి రెండు మూడు రోజులకీ ఎవరో వచ్చి నన్ను, నా పిల్లల్ని ప్రత్యేకంగా చూస్తుండటం గమనించాను. వాళ్ళు నిర్వాహకురాలితో మెల్లగా ఏదో మాట్లాడేవారు. ఒకరోజు నిర్వాహకురాలు నన్ను "ఇక్కడి నుంచి నువ్వు ఎక్కడికైనా వెళదామనుకుంటున్నావా!" అని అడిగింది.

క్షణంపాటు నేను ఆమెవంక చూసి యాంత్రికంగా "అవును" అన్నాను.

"నేను ఇక్కడికి దూరంగా పర్వతప్రాంత గ్రామంలో నువ్వుండటానికి ఏర్పాటుచేశాను. నువ్వు అక్కడ స్కూల్లో టీచర్‌గా పనిచేసుకోవచ్చు. నీకు హస్తకళల్లో ప్రావీణ్యం ఉండటం గమనించాను. గ్రామీణ స్త్రీలకి వాటిని నేర్పించవచ్చు. కాని, నువ్వు అయిదుగురు పిల్లల్ని ఎలా పెంచగలవు? వీళ్ళల్లో ఒక్కర్నో-ఇద్దర్నో ఎవరైనా ఉన్నవాళ్ళకి పెంపకం ఇస్తే బాగుంటుందేమో... ?" అన్నది.

ఆరోజు నాలో నిద్రించిఉన్న సర్పిణి మొట్టమొదటిసారి నిద్రలేచింది. ఎంత కోపం వచ్చిందంటే , నోటి వెంట మాట రాలేదు. ఆమె తలను గోడకేసి కొట్టేయ్యాలనిపించింది...

నిజానికి నాపట్ల నిర్వాహకురాలు ఎంతో దయచూపింది, కాని నా ఈ రూపం చూసి చాలా కంగారు పడింది. వెంటనే " అక్కరలేదు, నా మనస్సులో వచ్చిన ఆలోచన నీ ముందుంచాను... తొందరేమీ లేదు. ఆలోచించి చూడు" అన్నది.

ఆమె వెళ్ళిపోయిన రెండు క్షణాలకి నా ఆవేశం కొంత చల్లారింది. నా ప్రవర్తనకు నాకే ఆశ్చర్యం కలిగింది. కొంత సిగ్గుగా కూడా అనిపించింది. నేను జీవిత పర్యంతం ఎవరో ఒకరిపైన ఆధారపడి ఉండలేనని నాకు తెలుసు. ఏదో ఒక ఏర్పాటు చూసుకోవలసిందే. నిర్వాహకురాలు సూచించిన గ్రామానికి వెళ్ళటానికి ఎందుకు ఒప్పుకున్నానంటే- నా చుట్టూ ఉన్నవాళ్ళచేత అవమానాలు తప్పుతాయని. నాన్నగారి దానం స్వీకరించటం నన్ను నేను అవమానించుకోవటమే. బలహీనమైన క్షణాల్లో నాన్నకి ఉత్తరం రాద్దామని అనుకున్నాను. నన్ను ఎంతో గారాబంగా పెంచిన క్షణాలు నాన్నతో పంచుకోవాలని ఉబలాట పడ్డాను. కాని ఆ ప్రయత్నం మానుకున్నాను. సంస్కారాల జడత్వాన్ని తెంచుకొని నా కష్టాల్లో పాలుపంచుకోలేని వాళ్ళకి బాధ కలిగించటం ఆత్మపీడనమే అవుతుంది కదా!... గ్రామానికి వెళతాను, నాపిల్లల్ని నేనే పోషించుకుంటాను అని నిర్ణయించుకున్నాను.

ప్రియ మిత్రమా! ఏ పిల్లాడైతే అత్యాచారానికి ఫలితంగా పుట్టాడో, ఏ అంకురాన్నైతే కడుపులో చిదిమెయ్యాలని నేను ప్రయత్నం చేశానో, ఆ అన్వర్, అంటే ఇప్పటి అనిల్ మిగతా నలుగురు పిల్లలకంటే నన్ను ఎంతో ప్రేమగా చూస్తాడు. నా ద్వేషాన్నంతటినీ మింగేశాడు వాడు నీలకంఠుడిలా. నాకు వాడే సంరక్షకుడా అన్నట్టు వ్యవహరిస్తాడు. అప్పుడప్పుడు అడుగుతాడు అమాయకంగా "అమ్మా! నేనిప్పుడు అనిల్‌ని ఎలా అయిపోయాను? అన్వర్‌కి అనిల్‌కి ఏమిటి తేడా? అమ్మా! ఇక్కడి వాళ్ళందరూ మనల్ని ఏదోలా ఎందుకు చూస్తున్నారు?"

ఎనిమిదేళ్ళ వయసులోనే ఆ విధాత ఎంత బరువు-బాధ్యతలు మోపాడు వీడి భుజాలపైన! నూర్ కుమారుడైన అష్రఫ్, ప్రస్తుతం అశోక్, చాలా దుడుకుస్వభావం గల పిల్లాడు. ఎప్పుడూ ఏదో గొడవ తెచ్చిపెడుతుంటాడు. కాని చదువులో మాత్రం ముందుంటాడు. అస్‌గర్, అంటే ఇప్పటి అసిత్ నిజంగా తండ్రికి తగిన బిడ్డే. కవి కొడుకు కాబట్టి ఏమో ఎప్పుడూ ఏదో ఆలోచిస్తూ అన్యమనస్కంగా కనబడతాడు. తన ఆకర్షణీయమైన కళ్ళతో నన్ను చూస్తున్నప్పుడు నాకు ఫారూఖీనే జ్ఞాపకమొస్తాడు.

ఎన్ని జ్ఞాపకాలు, ఎన్ని మజిలీలు-వేటిని మర్చిపోను, వేటిని గుర్తుంచుకోను! ముజఫర్ బహుశా ఇప్పటికీ నాకోసం వెదుకుతూ ఉండి ఉంటాడు. 'వీళ్ళు నా పిల్లలు' అంటూ ఎప్పటికైనా వస్తాడేమో! అతని పిల్లలైన అహమ్మద్, అలీలు ఇప్పుడు అమిత్, అజిత్ అని పిలవబడుతున్నారు. పాపం వాళ్ళకి తమతండ్రి గురించి ఏమీ తెలియదు. అప్పుడప్పుడు అడుగుతూ ఉంటారు... నేను వాళ్ళకి అబద్ధం చెబుతున్నాను. ఎవరికీ నేను నిజం చెప్పలేదు. అసలు నిజమంటూ ఏమైనా ఉంటుందా? ఎవరి నిజాన్నైనా కొలవగల యంత్రాన్ని ఏ శాస్త్రజ్ఞుడైనా కనుక్కోగలిగాడా?

స్కూలు రిజిష్టరులో తల్లిపేరు రాయటం కుదరదు. తండ్రి పేరే రాయాలి. అనిల్, అశోక్, అసిత్, అమిత్, అజిత్‌లకు తండ్రెవరూ లేదు-అష్రఫ్, అసగర్, అహమద్, అలీలకు మాత్రం ఉన్నారు. అన్వర్ తండ్రెవరో ఎవరికీ తెలియదు. ఉపనిషత్తుల కాలంలో భారతదేశం ఎంత బాగుందేది! ఆ కాలంలో పరమ తత్వవేత్త సత్యకాముని దాసీమాత జాబిలి ఎంతధైర్యంగా చెప్పగలిగింది-" నీ తండ్రి ఎవరో నాకు తెలియదు. నువ్వు మాత్రం నా కుమారుడివి. గురువుగారి నమోదు పుస్తకంలో నాపేరే రాయించుకో!"

ఫలితంగా సత్యకాముని పేరు సత్యకామ్ జాబాలి అయ్యింది. ఇప్పుడు నా పిల్లలకు ఆ హక్కు సంక్రమిస్తుందా ఎప్పటికైనా? "మా తండ్రెవరో మాకు తెలియదు. తల్లి మాత్రమే తెలుసు-ప్రతిమ. ఆ పేరే రాసుకోండి రిజిష్టర్‌లో " అని నా పిల్లలు తలెత్తుకుని గర్వంగా చెప్పగలరా?

మాతృత్వమే స్త్రీకి పరిపూర్ణ సౌందర్యమంటారు. అది నాకు సంపూర్ణంగా లభించింది. అది ఏ దారిన వచ్చింది అనేది అప్రధానం... దీనిని మరొక దృష్టితో కూడా చూడండి. ఆర్య సంప్రదాయంలో తల్లి పదవి అన్నింటినీ మించినది. అందుకే ఆమె తాగాల్సి ఉంటుంది విషం. ఇతరుల కంటే ఎక్కువగా స్త్రీ అయిన కారణంగా అవమానపు విషం మిత్రమా! ఎవరినైతే ఎక్కువ అవమానించాలో వారికే అందమైన విశేషణలు ఎక్కువగా ఇవ్వబడతాయి. బలి ఇవ్వబోయే మేకను బాగా మేపకపోతే ఎవరు కొంటారు? మీరు స్త్రీ-పురుష సంబంధాల సౌందర్యంలో ఈ సత్యాన్ని గూర్చి చర్చించలేదు. పురుషుడే కదా చివరికి...

నేను ఇంత కఠోరంగా ఎలా మారాను అని మీరు అనుకుంటూ ఉండొచ్చు! ఆరోజు, వర్షం కురిసి అప్పుడే వెలిసింది. మట్టివాసన పరిమళిస్తోంది. గది కిటికీ తలుపులు తెరవాలనే కోర్కెను అణుచుకోలేకపోయాను. ఏ కిటికీ చువ్వలపై నాతల ఆనించి ఆరోజు మిమ్మల్ని చూశానో... ఇప్పుడు చెపుతున్నది ఆ కిటికీ గురించే...

ఆ రోజు నేను ఒక కుర్రాడిని చూశాను. 9-10 ఏళ్ళు ఉండొచ్చు. అందంగా, ఆరోగ్యంగా ఉన్నాడు. తెల్లటి స్కూల్ యూనిఫాం వేసుకొని, వీపున పుస్తకాల సంచితో... నెమ్మదిగా ఆశ్రమం గేటు వరకు వచ్చాడు... అటూ-ఇటూ కలియజూసి ఎగిరెగిరి మా కిటికీ వైపు చూడసాగాడు. నేను ఉలిక్కి పడ్డాను. నాకు ఆశ్చర్యం కలిగింది. కుర్రాడిని పరిశీలనగా చూశాను. అతను కూడా ఇటే చూడసాగాడు. మా చూపులు కలిశాయి. వెంటనే అతను ఏదో దెయ్యాన్ని చూసినట్టు వెనక్కి తిరిగి పరుగు పెట్టాడు. మళ్ళీ వెనక్కి తిరిగి చూడనైనా చూడలేదు.

ఆశ్చర్యం-క్షణంపాటు నాకేమీ అర్థం కాలేదు. తర్వాత ఒక చల్లటి వణుకు నా నరాల్లోకి చొచ్చుకువచ్చింది, 'ఒకవేళ... ఒకవేళ...!'

'కాదు... కాదు..' నేను వెంటనే వెనక్కి తిరిగేటప్పటికి ఎదురుగా అనిల్ ఉన్నాడు. నన్ను చూసిన వాడి ముఖంలో ప్రశ్న తొంగిచూసింది. 'ఏమిటమ్మా?'

'ఏమీలేదు, ఏమీలేదు' నన్ను నేను స్థిమితపరచుకోసాగాను. కాని లోపల...

'ఒక విషయం చెప్పనా అమ్మా?' నేను మళ్ళీ వణకసాగాను.

'అమ్మా! నేను చెప్పటం మర్చిపోయాను. చాలా రోజుల్నుంచి ఆ

అబ్బాయి ఇక్కడికి ఇలాగే వస్తున్నాడు' తప్పుచేసిన వాడిలా చెప్పాడు అనీల్.

'ఇక్కడికి చాలామంది వస్తారు. అబ్బాయిలూ వస్తుంటారు. నువ్వు చెప్పే అబ్బాయి ఎవరు?'

'ఆ అబ్బాయేనమ్మా! ఇప్పుడే వచ్చి పరుగెత్తుకెళ్ళాడే...'

'ఆ అబ్బాయా?' నిలువెల్లా వణుకుతూ గొణిగాను- 'ఆ అబ్బాయా...?'

'అతను చాలా మంచబ్బాయమ్మా! నాకు చాక్లెట్ కూడా ఇచ్చాడు. ఇక్కడ ప్రతిమ అంటే ఎవరు? అని అడిగాడు.'

నేను 'అవును, ఇప్పుడు మా అమ్మ పేరు అదే' అని చెప్పానమ్మా!

'ఇప్పుడు ఈ పేరా? ఇదివరకు ఈ పేరు కాదా?, అని అడిగాడు.

'అప్పుడు నేనన్నాను-ఇదివరకు మా అమ్మపేరు సురైయా బేగమ్. నా పేరు ఒకప్పుడు అన్వర్ అయితే ఇప్పుడు అనీల్ అయినట్టే...'

'అయితే ఆమె వేరే అయి ఉంటుంది. కాని, నాకొకసారి మీ అమ్మని చూపిస్తావా?' అన్నాడు.

'దానిదేముంది. అదిగో... ఆ కిటికీ కనిపిస్తుందే, అక్కడే. ఆ గదిలోనే మేముండేది. నాతో రా! అన్నాను.'

'ఇప్పుడు కాదు...నేను తర్వాత ఎప్పుడైనా వస్తాను... అని వెళ్ళిపోయాడు. ఆ అబ్బాయే మళ్ళీ ఈ రోజు వచ్చాడు..'

ఇదంతా వింటున్న 'నేను' ఎవరో, విన్న తర్వాత 'ఆ కుర్రాడి పేరేమిటి' అని అడిగిన 'నేను' ఎవరో నాకే తెలియదు.

'అమ్మా! అతని పేరు ఆశిమ్.'

రెండు చేతులతో గోడ పట్టుకున్నాను కాబట్టిగాని, లేకపోతే తప్పకుండా ఆ క్షణాన నేలమీదపడి స్పృహ కోల్పోయేదాన్ని. నా ఒళ్ళంతా చెమటతో తడిసి ముద్దయింది. అనీల్ మామూలుగానే అడిగాడు- 'అమ్మా! నీకు ఆ అబ్బాయి తెలుసా?"

నేను గట్టిగా అరిచినంత పని చేశాను 'లేదు.. లేదు.. నాకెవరూ తెలియదిక్కడ...'

అనీల్ నన్ను పరికించి చూశాడు-తెల్లబోయిన నా ముఖం చూసి కంగారు పడ్డాడు. 'అమ్మా! నీ ఒంట్లో బాగున్నట్టు లేదు.. పడుకో' అన్నాడు.

పాపం అనీల్! ఏం చెప్పను వాడికి? కొంచెం స్థిమితపడి 'ఏం లేదులే నాయనా! బాగానే ఉంది. నువ్వు మాత్రం ఆ అబ్బాయితో మాట్లాడొద్దు.. మనం కొత్తవాళ్ళతో స్నేహం..'

నేను నా మాట పూర్తయినా చెయ్యలేదు, వాడు పెద్ద నిట్టూర్పు విడిచి 'అలాగే' అన్నాడు.

వాడు 'అలాగే' అనటం విని నాకు మీరు జ్ఞాపకం వచ్చారు. ఆ రోజు మీరు కూడా అదేవిధంగా 'అలాగే' అన్నారు. కాని మీరెక్కడ. ఈ పిల్లాడెక్కడ! ఆ మాట వీడి నోటివెంట విని నాకు చెప్పలేని కోపం వచ్చింది. రెండు చేతులతో వాడి పీక పిసికెయ్యాలనిపించింది. కాని జరిగిందేమిటంటే వాణ్ణి నా హృదయానికి హత్తుకుని పొగిలి పొగిలి ఏడ్చాను.

రెండు క్షణాల తర్వాత నాకేమనిపించిందో! వాడు అనీల్ కాదు నా ఆశిమ్ అనిపించింది.. నేను పదేపదే వాడి మొఖాన్ని ప్రేమగా ముద్దాడాను...

చాలారోజులపాటు నేను అదే కిటికీ చువ్వలకు తల ఆనించి అదేవైపు రెప్ప వెయ్యకుండా చూశాను, కాని ఆ అబ్బాయి మళ్ళీ ఎప్పుడూ అటు రాలేదు.. ఒక కల మాత్రం వచ్చింది...

....వెతుక్కుంటూ-వెతుక్కుంటూ నేను ఒక పెద్ద బంగళాలోకి ప్రవేశించాను. ఎంత ఆడంబరం... ఎంత విలాసం...! కాని ఈ కేకలేమిటి? ఎవరో అబ్బాయి పెడుతున్న గావుకేకలు-హృదయ ద్రావకంగా... నేను పరుగెత్తుకుంటూ లోపలికి వెళుతున్నాను. అక్కడ ఒక యువకుడు క్రూరంగా 9-10 ఏళ్ళ పిల్లాడిని బెత్తంతో విచక్షణారహితంగా బాదుతున్నాడు. 'దరిద్రుడా! మళ్ళీ ఎప్పుడైనా అటువైపు వెళ్ళావంటే చంపి పాతేస్తాను, జాగ్రత్త..." అంటున్నాడు.

ఆ అబ్బాయి ఏడుస్తూ "వెళ్ళను... వెళ్ళను.. నన్ను కొట్టొద్దు... కొట్టొద్దు" అంటున్నాడు.

ఆ యువకుణ్ణి గుర్తు పట్టాను, అతనెవరో కాదు-నా మరిది. అతని వెనకే మా అత్తగారు నిలబడి ఉన్నారు. నేను పరుగెత్తుకుంటూ వెళ్ళి ఆ యువకుడి చేతిలో ఉన్న బెత్తం లాగేసుకున్నాను. 'ఆ అమాయకుడినెందుకు కొడతావు, తప్పు చేసినదాన్ని నేను, నన్ను చంపు...'

వాళ్ళు నన్ను గుర్తించారు... మరుక్షణమే ఆశిమ్ పరుగెత్తుకుంటూ వచ్చి నన్ను పెనవేసుకుపోయాడు. నా చేతుల్లోనే స్పృహ కోల్పోయాడు...

"సిగ్గు మాలినదానా, కళంకం మూటకట్టుకుని ఇంకా చావకుండా బ్రతికే ఉన్నావా? నువ్వు చచ్చుంటే సంతోషించే వాళ్ళం" ద్వేషంతో అరిచారు మా అత్తగారు...

అప్పుడే నాకు మెలకువ వచ్చింది. చీకట్లో కళ్ళు బాగా తెరచి మరీ చూశాను... నేనున్నది నా గదిలోనే.

మనిషి తనను తానే ఎందుకు మోసం చేసుకుంటా? తనకు తానే అపరిచితుడిలా ఎందుకు మారిపోతాడు?.... నా వాడే, నా ప్రేమకు ప్రతిరూపమైన వాడే నాకు కాకుండా పోయాడు... కారణమేమైనా, కుంతి కర్ణుని దగ్గరకు వెళ్ళగలిగింది. కాని నేను...

ఆరోజే నిర్వాహకురాలి దగ్గరకు వెళ్ళి "మీరు నన్ను దూరంగా ఏదో గ్రామానికి పంపుతానన్నారు గదా! నేను ఇవ్వాళే వెళ్ళటానికి సిద్ధంగా ఉన్నాను. కాని నా పిల్లల్ని మాత్రం నా నుంచి దూరం చెయ్యకండి. వాళ్ళు అవమానానికి గురిఅవుతూ ఉంటే భరించలేను" అన్నాను.

మిత్రమా! నేను వచ్చేవారం వెళ్ళిపోతున్నాను - మరొక జీవితం ప్రారంభించటానికి. ఎందుకో మిమ్మల్ని ఒకసారి చూడాలని గట్టిగా అనిపిస్తుంది. ఎందుకు మీరు నాకు ఆత్మీయులుగా అనిపించారో తెలియదు. ఆ ఆత్మీయత కారణంగానే నేను మిమ్మల్ని మిత్రులుగా సంబోధించాను. స్నేహితుల సమక్షంలోనేగా ఎవరైనా మనస్సు విప్పగలిగేది! ఎలాంటి విచిత్రమైన సంబంధం... కలలో ఏర్పడింది, కళ్ళు తెరిచి చూస్తే అనంతమైన శూన్యమే చేతికి అందింది. అయినా నా నమ్మకం-అది నా హృదయం నుంచి వచ్చింది, ఎవరి ప్రమేయం లేకుండా. ఎలాంటి ఘోరమైన కష్టాలు-బాధల గుండా నేను ప్రయాణం కొనసాగించానో, అవి నాకు ఈ శూన్యాన్నే సంపదగా ఇచ్చాయి. ఇది నా హృదయాంతరాలలో ఇమిడిపోయింది. దీనిని ఈ చర్మ చక్షువులు చూడలేవు.

నరే, బయట వర్షం కురుస్తుంది... కురవాలిగా, మోడు చిగురించటానికి...

ఇట్లు

మీ స్నేహితురాలు

ప్రతిమ అలియాస్ ఆయేషా అలియాస్ సురైయా అలియాస్

ప్రతిమ...